


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 06 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 80 పేజీలు : 4 వెల : రూ 3-00


### కేదార్నాథ్ దేవాలయంలో

## ప్రధాని మోదీ పూజలు..



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్లోని రుద్రప్రయాగ్ జిల్లాలోని కేదార్నాథ్ ఆలయానికి చేరుకున్న ప్రధాని మోదీ అక్కడ పూజలు చేశారు. కేదార్నాథ్ ఆలయం శివునికి అంకితం చేశారు. మందాకిని నది ఒడ్డున ఉన్న కేదార్నాథ్ ఆలయం నాలుగు పురాతన పుణ్యక్షేత్రాల్లో ఒకటి దీనినిచార్‌ధామ్ యాత్ర అని పిలుస్తారు . ఇందులో యమునోత్రి , గంగోత్రి, బద్రీనాథ్ ఆలయాలు కూడా ఉన్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కేదార్నాథ్ఆలయ పర్యటనకోసం శుక్రవారం డెహ్రాడూన్విమానాశ్రయానికి చేరుకున్నారు. డెహ్రాడూన్ విమానాశ్రయంలో ప్రధాని మోదీకి ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్ సింగ్(రిటైర్డ్ ) , సీఎం పుష్కర్ సింగ్ ధామిస్వాగతంపలికారు. 2013 ఉత్తరాఖండ్ వరదల్లో విధ్వంసం తర్వాత పునర్నిర్మించిన శ్రీఆదిశంకరాచార్య సమాధిని ప్రధాని ప్రారంభించనున్నారు . ఉత్తరాఖాండ్లోని కేదార్నాథ్ పుణ్యక్షేత్రంలో ప్రధాని మోదీ ప్రార్ధనలు చేయనున్నారు. ప్రధాని మోదీ పర్యటనకు ముందు కేదార్నాథ్ పుణ్యక్షేత్రంలో ఏర్పాట్లు చేశారు. రూ . 130 కోట్లతో నిర్మించిన సరస్వతి రిటైనింగ్‌వాల్, ఘాట్లు, మందాకిని రిటైనింగ్ వాల్ , తీర్థ పురోహిత్ హౌస్లు , మందాకిని నదిపై గరుడ్ చట్టి వంతెనలను కూడా ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు .పీఎం మోదీ ఉత్తరాఖండ్ రాష్ట్రంలో బహుళ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు . పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన తర్వాత బహిరంగ సభలో ప్రసంగించనున్నారు . ఉత్తరాఖండ్ రాష్ట్రంలో 2022 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రధాని మోదీ పర్యటించడం విశేషం.ప్రధాని తన పదవీ కాలంలో ఆలయాన్ని సందర్శించడం ఇది రెండోసారి . మోదీ గతంలో చివరిసారిగా 2019 లో కేదార్నాథ్ ఆలయాన్ని సందర్శించారు .


## 'రైతుల ఆందోళనపై బాబు రాజకీయం మానుకోవాలి'



### షుగర్ ఫ్యాక్టరీ, రైతుల మధ్య వివాదంపై మంత్రి బొత్స సమీక్ష

విజయనగరం: ఎన్‌సీఎస్ షుగర్ ఫ్యాక్టరీతో రైతుల బకాయిల వివాదంపై మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. రైతుల డిమాండ్, యాజమాన్య వైఖరిపై చర్చించారు. ఈ సందర్భంగా పోలీసులపై దాడి, పోలీస్ సిబ్బందికి గాయాల విషయాన్ని జిల్లా ఎస్పీ దీపికా మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి రైతులకు త్వరగా న్యాయం జరిగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యాజమాన్యంతో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని మంత్రి బొత్స పేర్కొన్నారు. షుగర్ ఫ్యాక్టరీ రైతుల ఆందోళనపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాజకీయం చేయడం మానుకోవాలని రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ప్రేమ ఉందని పేర్కొన్నారు. రైతుల ఆందోళనను ప్రభుత్వం అర్థం చేసుకుందని తెలిపారు. రైతులపై లాఠీచార్జ్ చేశారని అసత్యప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.రైతుల ముసుగులో వామపక్షనాయకలు పోలీసులపై రాళ్లు రువ్వారని అన్నారు. పోలీసులకు గాయాలు అయ్యాయని అయినా పోలీసులు సంయమనం పాటించారని గుర్తుచేశారు. ఏ ఒక్క రైతుపై చేయిచేసుకోలేదన్నారు. ఎన్‌సీఎస్ యాజమన్యానికి చెందిన 24 ఎకరాల భూమి వేలం వేయడానికి న్యాయపరమైన అంశాలు పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అదుపులో 34వేల బస్తాల పంచదార ఉందని, వీటిని విక్రయించి రైతుల బకాయి రూ. 16కోట్ల చెల్లిస్తామని అన్నారు. 2013-2014 రైతుల బకాయిలు రూ. 20 కోట్లు 2019లో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చాక సెటిల్ చేశామని తెలిపారు.చంద్రబాబు తన 5 ఏళ్ల కాలంలో ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. యాజమాన్యంపై ప్రభుత్వానికి నమ్మకం లేదని, 2019-20కి సంబంధించిన బకాయిలు ప్రతి రైతుకు పైసాతో సహా చెల్లింపులు జరపాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు.సాగు చేసిన చెరుకును ఇతర ఫ్యాక్టరీలకు మళ్లించే ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఇప్పుడే గంజాయి సాగు జరుగుతోందని చంద్రబాబు అంటున్నారని, కానీ ఆయన పాలనా కాలంలోనే ఇక్కడ నుంచి ప్రపంచవ్యాప్తంగా గంజాయి ఎగుమతి అవుతోందని అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు అనడం నిజం కాదా అని నిలదీశారు. అమరావతి రైతులు ఎక్కడున్నారు అది టీడీపీ రాజకీయ పాదయాత్ర అని ఎద్దేవా చేశారు. విశాఖ రాజధాని కాకుండా న్యాయస్థానాలను ఆశ్రయించి జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు మేలు చేయండని పవన్ కళ్యాణ్ అడగడం లేదని, బిర్యానీ, భోజనం పెడతా ఆందోళన చేద్దాం రండని పిలుపు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు.

## కిలో రూ.20 వరకు తగ్గిన వంట నూనెల ధరలు



న్యూఢిల్లీ: దేశంలో వంట నూనెల ధరల గణనీయంగా తగ్గాయని కేంద్ర ఆహార ప్రజాపంపిణీ విభాగం తెలిపింది. నూనె రకాన్ని బట్టి కిలోకు కనిష్ఠంగా రూ.7 నుంచి గరిష్ఠంగా రూ.20 వరకు తగ్గినట్లు ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ డిపార్టుమెంట్ కార్యదర్శి సుధాన్షు పాండే వెల్లడించారు. పామాయిల్, పల్లి నూనె, సోయాబీన్ నూనె, పొద్దుతిరుగుడు నూనెతోపాటు అన్ని ప్రధానమైన నూనె రకాలపై ధరలు తగ్గినట్లు తెలిపారు. కాగా, కరోనా దేశంలో కాలుమోపిన అనంతరం కొండెక్కిన వంట నూనెల ధరలు.. ఇప్పుడిప్పుడే దిగి వస్తున్నాయి. 2020, మార్చిలో కిలో రూ.70-80 మధ్య ఉన్న వంట నూనెల ధరలు ఆ తర్వాత కరోనా మహమ్మారి కారణంగా కొండెక్కాయి. కిలో నూనె రూ.190-200 వరకు పలికింది. ఆ తర్వాత క్రమంగా దిగివచ్చి ప్రస్తుతం 150-160 మధ్య ఉన్నది. ఇప్పుడు ధరలు మరికాస్త తగ్గడంతో కిలో నూనె రూ.140కి అటుఇటుగా ఉండే అవకాశం ఉన్నది.

## 14 ఏళ్లు సీఎంగా ఉండి కనీసం మంచి నీళ్లు ఇవ్వలేకపోయారు: పెద్దిరెడ్డి



చిత్తూరు: చిత్తూరు జిల్లా కుప్పంలో పండగ వాతావరణం నెలకొంది. మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం సభ నిర్వహిస్తోంది. ఈ సభకు భారీ ఎత్తున జనం తరలి రావడంతో సభా ప్రాంగణం నిండిపోయింది. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప తోపాటు ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, ద్వారకనాథరెడ్డి, వెంకట గౌడ, కోనేటి ఆదిమూలం తదితరులు ఈ సభకు హాజరయ్యారు.సభలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. 14 సంవత్సరాల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం కుప్పం చేసిన అభివృద్ధి శూన్యం అని అన్నారు. చంద్రబాబు చెప్పుకోవడానికి ఒక్క అభివృద్ధి పని కూడా తన పాలనలో చేయలేదన్నారు. సాగునీరు, తాగునీరు అందించలేని దౌర్భాగ్యస్థితి చంద్రబాబుది అని ఫైర్ అయ్యారు. అనునిత్యం కుప్పం నుంచి బెంగళూరుకు వేలాదిమంది కూలి పనులకు వెళ్తుంటే చంద్రబాబు ఏం చేసాడు అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మాట్లాడుతూ.. చంద్రబాబుకు అసహనం పెరిగిపోయింది.

## 5 రాష్ట్రాల ఎన్నికల వ్యూహం

### 7న బీజేపీ నేషనల్ ఎగ్జిక్యూటివ్




న్యూఢిల్లీ: ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికలు మిశ్రమ ఫలితాలను ఇచ్చిన నేపథ్యంలో పార్టీ అత్యున్నత నిర్ణాయక విభాగమైన బీజేపీ జాతీయ ఎగ్జిక్యూటివ్ ఈనెల 7వ తేదీ ఆదివారంనాడు సమావేశమవుతోంది. 5 రాష్ట్రాల్లో (ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్, పంజాబ్) వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ఇతర కీలకాంశాలపై కూడా సమావేశంలో చర్చ ఉంటుందని పార్టీ వర్గాల సమాచారం. కోవిడ్ ఆంక్షల కారణంగా 2019 తర్వాత బీజేపీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశం జరగనుండటం ఇదే ప్రథమం. అధ్యక్ష ఉపన్యాసం, సంతాప తీర్మానం, రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై చర్చ-తీర్మానాలు, వర్తమాన అంశాలు, చేపట్టబోయే కార్యక్రమాలు, ముగింపు ఉపన్యాసం వంటివి సమావేశం ఎజెండా జాబితాలో చేర్చినప్పటికీ శనివారంనాడు జరిగే ప్రధాన కార్యదర్శుల సమావేశంలో ఎజెండా అంశాలు ఖరారు అవుతాయని బీజేపీ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ తెలిపారు. ఎజెండాలోని తీర్మానాలను ఆదివారం జరిగే నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆమోదించనున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రారంభోపన్యాసంతో సమావేశం ప్రారంభమవుతుంది. ప్రధాని మోదీ ముగింపు ఉపన్యాసం చేస్తారు. దేశంలో 100 కోట్ల వ్యాక్సినేషన్ పూర్తవడం, ఇంధనం ధరల తగ్గింపు, ఇటీవల చేపట్టిన విదేశీ పర్యటనలు విజయవంతం కావడంపై ప్రధాని మోదీని ప్రశంసిస్తూ సమావేశంలో ఒక తీర్మానం ఆమోదిస్తారని కూడా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఎన్‌డీఎంసీ కన్వెన్షన్ సెంటర్‌లో బీజేపీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశం జరుగుతుందని బీజేపీ రాజ్యసభ ఎంపీ, పార్టీ మీడియా సెల్ జాతీయ అధ్యక్షుడు అనిల్ బాలుని తెలిపారు. నేషనల్ ఆఫీస్ బేరర్లు, కేంద్ర మంత్రులు సమావేశానికి నేరుగా హాజరవుతారని, రాష్ట్ర నేతలు తమ తమ రాష్ట్ర రాజధానుల నుంచి వర్చువల్ మీట్ ద్వారా పాల్గొంటారని చెప్పారు.

## సీఎం జగన్‌ని కలిసిన తూర్పు నావికా దళం ఫ్లాగ్ ఆఫీసర్ అజేంద్ర బహదూర్‌సింగ్



అమరావతి: సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తూర్పు నావికా దళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ అజేంద్ర బహదూర్‌సింగ్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా డిసెంబర్ 4న విశాఖలో జరిగే 'నేవీ డే' వేడుకలకు సీఎం వైఎస్ జగన్‌ను ఆహ్వానించారు. ఏపీ ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ సిటీ పేరుతో ముంబైలో నావికాదళ యుద్ధనౌక ఐఎన్‌ఎస్ విశాఖపట్టణం త్వరలో ప్రారంభం కానున్నదని సీఎంకి వివరించారు. అనంతరం అజేంద్ర బహదూర్‌సింగ్‌ని సీఎం వైఎస్ జగన్ సన్మానించి, వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు. సీఎంని కలిసిన వారిలో నేవీ ఉన్నతాధికారులు కెప్టెన్ వీఎస్‌సీ రావు, కెప్టెన్ వికాస్ గుప్తా, సివిల్ మిలటరీ లైజన్ ఆఫీసర్ కమాండర్ సుజిత్ రెడ్డి, ఫ్లాగ్ లెఫ్టినెంట్ శివమ్ కందారి ఉన్నారు.

## ముగిసిన స్థానిక సంస్థల నామినేషన్ల ప్రక్రియ




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థలు ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ఎన్నికలు నిలిచిన 14 జెడ్పీటీసీ స్థానాలతోపాటు 176 ఎంపీటీసీ, 69 సర్పంచ్, 533 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. గ్రామపంచాయతీల నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 9 చివరితేదీ.మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు: 8వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువుపరిషత్ ఎన్నికలు: ఈ నెల 9న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీఈ నెల 14న పంచాయతీ ఎన్నికలు నిర్వహణ, ఓట్ల లెక్కింపు జరగనుండగా.. ఈ నెల 15న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 17న వీటి కౌంటింగ్ జరగనుంది. ఈ నెల 16న పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తుండగా.. 18న కౌంటింగ్ జరగనుంది. నెల్లూరు కార్పొరేషన్‌తో, 12 మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లోని 54 డివిజన్లు, 353 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. అలాగే 7 కార్పొరేషన్‌లు, 13 మునిసిపాలిటీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల మరణంతో ఖాళీ అయిన స్థానాలకు.. ఈ ఏడాది మార్చిలో ఎన్నికలు జరగని డివిజన్లు, వార్డులకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు.

### ఏపీ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించిన పయ్యావుల

అమరావతి: ఏపీ ప్రభుత్వాన్ని టీడీపీ నేత పయ్యావుల కేశవ్ సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆగమేఘాలపై ఒప్పందాలు జరుగుతాయా? అని ప్రశ్నించారు. మంచి, చెడ్డలు చూడకుండా ఎలా నిర్ణాయాలు తీసుకుంటారా అని నిలదీశారు. విద్యుత్ ఒప్పందాలు గంటల్లోనే జరిగిపోతున్నాయని, 9వేల మెగావాట్లకు గ్రిడ్ సెక్యూరిటీ ఉందని ఎలా చెబుతున్నారు?.. ఏపీ డిస్కంలకు చేరేటప్పటికీ ఎంత ధర పడుతుందని ఎలా చెప్పగలరు? అని ప్రశ్నించారు. రూ.2.49కి ఇంకా ఎంత అదనంగా చెల్లిస్తున్నారో చెప్పాలన్నారు.

## బెంగాల్ మంత్రి సుబ్రతా ముఖర్జీ కన్నుమూత



.నవంబర్ 5:-కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత, పశ్చిమబెంగాల్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సుబ్రతా ముఖర్జీ (75) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఎస్‌ఎస్‌కేఎం ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచినట్టు సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న వెంటనే దీదీ ఆస్పత్రి వద్దకు వెళ్లారు. సుబ్రతా ముఖర్జీ మరణం పట్ల తీవ్రద్గ్రాభ్భంతి వ్యక్తంచేశారు. సుబ్రతా ముఖర్జీ ఇక లేరన్న వార్తను నమ్మలేకపోతున్నానన్నారు. ఆయన ఎంతో నిబద్ధత కలిగిన నేత అని కొనియాడారు. సుబ్రతా ముఖర్జీ మరణం తనకు వ్యక్తిగతం ఎంతో నష్టమని తెలిపారు. ఆయనలేని లోటు పూడ్చలేనిదన్నారు. గత వారంలో తీవ్రమైన శ్వాస సంబంధమైన ఇబ్బందులు తలెత్తడంతో సుబ్రతా ముఖర్జీని ఐసీయూలోకి తరలించి చికిత్స అందించినట్టు వైద్య సిబ్బంది వెల్లడించారు.

# సంపాదకీయం

శనివారం 06 నవంబరు 2021

## వినోదం వలన పెరుగుతున్న కాలుష్యం

విమానయానం, ఆటోమోటివ్, ఆహార రంగాల్లో అత్యధికంగా సీవో2 ఉద్గారాలు వెలువడుతుండటంపై ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రధానంగా దృష్టి సారించనున్నారు, కానీ డీస్నీ నుంచి నెట్‌ఫ్లిక్స్ వరకు జనరంజకమైన వినోద సేవల విస్ఫోటనం... భూమ్మీద స్ట్రీమింగ్ బూమ్ ఎంత వినాశకరంగా మారుతోందనే ప్రశ్నను లేవనెత్తుతోంది. ఒక డివైస్‌లోని కంటెంటును తిలకించడానికి భారీ ఎత్తున డేటా సెంటర్లను ఉపయోగించడంతోపాటు, వైఫై, బ్రాడ్ బ్యాండ్ ద్వారా ట్రాన్స్‌మిషన్ వరకు ఒక వీడియోను స్ట్రీమ్ చేయడానికి అవసరమయ్యే ప్రతి చర్యకూ కావలసింది విద్యుత్తు. ఈ విద్యుత్‌లో చాలా భాగం గ్రీన్‌హౌస్ వాయువులను వెలువరించడం ద్వారానే ఉత్పత్తవుతోందని గ్రహించాలిఅత్యంత ప్రజాదరణ పొందిన తన సిరీసులను యూజర్లు ఎన్ని గంటలపాటు వీక్షిస్తున్నారనే అంశంపై నెట్‌ఫ్లిక్స్ అరుదైన విషయాన్ని ఇటీవలే బయటపెట్టింది. స్విడ్ గేమ్, స్ట్రేంజర్ థింగ్స్, మనీ హీస్ట్, బ్రిడ్జర్‌టన్‌తోపాటు తాను ప్రసారం చేస్తున్న 10 అగ్రశ్రేణి షోలను 600 కోట్ల గంటలపాటు ఫ్యాన్స్ తిలకిస్తున్నారని వెల్లడించింది. పాపులర్ షోలను ప్రసారం చేశాక, తొలి 28 రోజుల్లో దాన్ని అభిమానులు వీక్షించిన గంటల లెక్క ఇది. ఈ స్ట్రీమింగ్ మొత్తంగా విద్యుత్తుపై ఆధారపడి ఉంది. డీస్నీ నుంచి యూట్యూబ్ దాకా ఇలా జనరంజకమైన వినోద సేవల విస్ఫోటనం... భూమ్మీద కర్బన ఉద్గారాలకు కారణమై, వినాశకరంగా మారుతోంది. ఈ షోలకు పెరుగుతున్న జనాదరణ భూగోళంపై చూపుతున్న దుష్ప్రభావం చర్చ రేపుతోంది. దీనికి స్ట్రీమింగ్ పరిశ్రమ, వినియోగదారులు పరిష్కారం వెతకాల్సి ఉంది.వీడియో స్ట్రీమింగ్‌కి ఒక నిగూఢ రహస్యం ఉంది. నెట్‌ఫ్లిక్స్ చానెల్‌లో 10 అగ్రశ్రేణి గ్లోబల్ టీవీ హిట్ సీరియల్స్‌ని ఒక నెలపాటు అభిమానులు చూడటం ద్వారా ఉత్పత్తవుతున్న కర్బన ఉద్గారాలు... ఒక కారులో శనిగ్రహానికి అవతలవరకు డ్రైవ్ చేసుకుంటూ పోతే ఏర్పడే కర్బన ఉద్గారాలతో సమానం. అదేవిధంగా ప్రపంచంలోనే అతిపెద్ద వీడియో షేరింగ్ సైట్ యూట్యూబ్ ఒక ఏడాదిలో వెలువరించే గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణం, గ్లాస్‌గో నగరంలో ఒక సంవత్సరంలో వెలువడే గ్రీన్‌హౌస్ వాయువులను మించిపోతోంది. ఒక యూజర్ ఒక గంట వీడియో స్ట్రీమింగ్ చేస్తే అది 100జి కార్బన్ డయాక్సైడ్‌కి సమానమైన ఉద్గారాలను ఉత్పత్తి చేస్తుందని నెట్‌ఫ్లిక్స్ అంచనా వేసింది. ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే, ప్రతి గంట వీడియో స్ట్రీమింగ్ కోసం 55జి లేక 56జి యూరోపియన్ సగటు సీవో2 ఉత్పత్తవుతుందని కార్బన్ ట్రస్ట్ సంస్థ పేర్కొంది. ఇది ఒక కారులో 300 మీటర్లు డ్రైవ్ చేస్తే వెలువడే కార్బన్ ఉద్గారాలకు సమానం. ప్రపంచవ్యాప్తంగా హిట్టయిన అత్యంత ప్రజాదరణ పొందిన తన సీరియల్స్‌ని యూజర్లు ఎన్ని గంటలపాటు వీక్షిస్తున్నారు అనే అంశంపై నెట్‌ఫ్లిక్స్ అరుదైన విషయాన్ని ఇటీవలే బయటపెట్టింది.యూట్యూబ్ స్ట్రీమింగ్ సైట్లలో వీడియోలను తిలకించడం ద్వారా ఒక ఏడాదిలో 11 మిలియన్ టన్నుల కంటే ఎక్కువగా కార్బన్ డయాక్సైడ్‌ను ఉత్పత్తి చేస్తోందని సమాచారం. అంటే గ్లాస్‌గో లేదా ఫ్రాంక్‌ఫర్ట్ నగరాలు ఉత్పత్తి చేస్తున్న సీఓ2కి ఇది సమానం. ఆ సంవత్సరం యూట్యూబ్‌కి 140 కోట్లమంది యూజర్లు ఉండేవారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థకు 240 కోట్ల మంది యూజర్లు ఏర్పడ్డారు. అంటే ఈ ఒక్క సంస్థ వెలువరిస్తున్న కార్బన్ ఫుట్‌ప్రింట్ ఈరోజు మరింత ఎక్కువగా ఉ ంటుంది.కర్బన ఉద్గారాలను లేకుండా చేసే తటస్థ స్థాయిని సాధించాలని ఈ కంపెనీలు భావిస్తున్నట్లయితే, గ్రీన్ ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టడంతో ఆగిపోవడానికి బదులుగా, ఉద్గారాలను వీలైనంత ఎక్కువగా తగ్గించే వ్యూహాలను అమలు చేయాలని రాబిన్‌సన్ చెప్పారు. నెట్ జీరో అనేది ఇప్పుడు సరికొత్త కార్బన్ టాక్స్ ప్రమాణంగా మారింది. ఇది నా సమస్య కాదు అని తప్పించుకోవడానికి వీల్లేని పరిస్థితి ఏర్పడింది. వాణిజ్య సంస్థల కార్యకలాపాల్లోనే ఉద్గారాల తగ్గింపు అమలు కావాలి. ఊరకే ప్రకటనలతో జిమ్మిక్కు చేయకుండా ఈ సంస్థలు కాస్త విభిన్నంగా వ్యవహరించాలని ఆయన చెప్పారు. 'పర్యావరణ ప్రభావాలను తగ్గించడంలో సానుకూల మార్పులను తీసుకురావడానికి స్ట్రీమింగ్ రంగంలోనే చాలా ఎక్కువ అవకాశాలున్నాయి కాబట్టే మేము గ్రీనింగ్ ఆఫ్ స్ట్రీమింగ్ సంస్థను స్థాపించాము. టెక్నాలజీ సైతం దీన్ని సాధ్యపడేలా చేస్తోంది' అని రాబిన్‌సన్ చెప్పారు.ఆర్థిక వ్యవస్థలో స్ట్రీమింగ్ ద్వారా ఏర్పడే కార్బన్ ఫుట్‌ప్రింట్ సాంద్రత ఇప్పటికీ చాలా తక్కువగానే ఉందన్న విషయాన్ని గ్రహించాల్సి ఉంది. హీటింగ్, వాహనాలు, ఫుడ్ ప్రాసెసింగ్ అనేవి ఎక్కువగా ఉద్గారాలను ఏర్పరుస్తున్నాయని భావిస్తుంటాం. వీటిని మనం తక్కువగా చూడవలసిన పనిలేదు. అదే సమయంలో ఒక గంట పాటు సాగే వీడియో స్ట్రీమింగ్ కంటే ఎక్కువ కార్బన్ ఫుట్‌ప్రింట్... పాల ప్రాసెసింగ్ పరిశ్రమలో తయారవుతోందన్న వాస్తవాన్ని కూడా మర్చిపోకూడదని బ్రిస్టల్ వర్సిటీ సీనియర్ లెక్చరర్ స్మైన్ హెచ్చరిస్తున్నారు.

# త్రిశంకు స్వర్గంలో ఎయిడెడ్ సంస్థలు

విజయవాడ, నవంబర్ 5, (న్యూస్ పల్స్) ఎయిడెడ్ విద్యా సంస్థల ఉసురు తీసిన ప్రభుత్వం వాటిలోని విద్యార్థులను త్రిశంకుస్వర్గంలోకి నెట్టింది. తమ విద్యా సంస్థను ప్రభుత్వానికి అప్పగించేయడంతో మూసేస్తున్నామని, విద్యార్థులు టిసిలు తీసుకోవాలని వెళ్లిపోవాలని ఆయా విద్యా సంస్థలు చెప్తుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాష్ట్రంలో ఎక్కడిక్కడే ఆందోళనలకు దిగుతున్నారు. తమ పిల్లల చదువు ఏమి కావాలని ఆగ్రహం చేస్తున్నారు. ప్రభుత్వపరమైన, ప్రయివేట్‌కు మారిన ఎయిడెడ్ విద్యా సంస్థల్లోని విద్యార్థులను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. దగ్గరలో ప్రయివేట్ విద్యా సంస్థలు అందుబాటులో లేకపోవడం, ఉన్న విద్యా సంస్థల్లో సీట్లు ఖాళీ లేకపోవడంతో ఈ విషయంలో అధికారులు చేతులెత్తేశారు. దీంతో, ప్రైవేట్‌కు మారిన, ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధపడిన ఎయిడెడ్ విద్యాసంస్థ ల్లోనే అత్యధిక మంది విద్యార్థులు ప్రస్తుతం కొనసాగుతున్నారు. ప్రభుత్వానికి అప్పగించిన విద్యాసంస్థలు పూర్తిగా మూతబడితే రాష్ట్రంలోని లక్షలాది విద్యార్థుల చదువు ప్రశ్నార్థకం కానుంది. ఎయిడెడ్ విద్యాసంస్థల్లో నామమాత్రపు ఫీజులు ఉండేవి. ఎయిడెడ్ నుంచి ప్రైవేటుకు మారిన విద్యా సంస్థలు భారీగా ఫీజులు వసూలుకు సిద్ధం అవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన వారంతా పేదవర్గాలకు చెందిన వారు కావడమే ఇందుకు కారణం. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కొన్ని ఎయిడెడ్ పాఠశాలలు కోర్టును ఆశ్రయించాయి.పశ్చిమగోదావరి జిల్లాలోని 236 ఎయిడెడ్ పాఠశాలలకుగానూ వాటిలో 44 పాఠశాలల యాజమాన్యాలు తమ పాఠశాలలను ప్రభుత్వానికి అప్పగించడానికి అంగీకరించాయి. ప్రైవేట్‌గా నిర్వహించుకోవడానికి ముందుకొచ్చిన 192 పాఠశాలల్లోని 11,750 మంది, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 14,333 మంది విద్యార్థులపై ఫీజుల భారం పడనుంది.గుంటూరు జిల్లాలో 365 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రైవేట్ వైపు మొగ్గు చూపిన 257 పాఠశాలల్లో సుమారు ఏడు వేల మంది విద్యార్థులు ఉన్నారు. ప్రసిద్ధి చెందిన హిందూ కళాశాల, ఆంధ్రా క్రైస్తవ కళాశాల, టిజెపిఎస్ కళాశాల సహా మొత్తం 33 ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు ప్రైవేట్‌పరం కావడంతో సుమారు 15 వేల మంది విద్యార్థులపై ప్రభావం పడింది.కడప జిల్లాలో 143 పాఠశాలలు ఉండగా వాటిలో 40 పాఠశాలల విలీనానికి అంగీకరించాయి. వీటిలో 15,256 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా అవే పాఠశాలల్లో తాత్కాలికం గా కొనసాగుతున్నారు.కృష్ణా జిల్లాలో 270 పాఠశాలల్లో రెండింటిని ప్రభుత్వానికి ఆయా యాజమాన్యాలు అప్పగించాయి. మిగిలిన 268 ప్రైవేట్ వైపు మొగ్గుచూపాయి. ఈ పాఠశాలల్లో 18,803 మంది చదువుతున్నారు. కోర్టు వివాదాల కారణంగా 41 సిబిసిఎన్‌సి మిషనరీ పాఠశాలల వివరాలను జిల్లా అధికారులు సేకరించలేదు. ప్రసిద్ధి చెందిన శ్రీ పద్మావతి హిందూ కళాశాల, ఆంధ్ర జాతీయ కళాశాల, హిందూ కళాశాలలు ప్రయివేట్‌గా మారడంతో ఫీజుల మోత మోగింది.నెల్లూరు జిల్లాలో 120 ఎయిడ్ విద్యా సంస్థలు ఉన్నాయి. ప్రసిద్ధి చెందిన విఆర్ విద్యా సంస్థలతో పాటు మొత్తం పది విద్యాసంస్థలు ప్రభుత్వంలో విలీనానికి అంగీకరించాయి. మిగిలిన విద్యా సంస్థలన్నీ ప్రైవేట్‌కు మొగ్గు చూపాయి. వాటిలో సమారు 12 వేల మంది చదువుతున్నారు.విజయనగరం జిల్లాలో ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు ఐదు ఉన్నాయి. వాటిలో పార్వతీపురంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రభుత్వంలో విలీనానికి అంగీకరించింది. మిగిలిన వాటిలో ప్రసిద్ధి చెందిన విజయనగరంలోని ఎంఆర్ కళాశాల, మహారాజా ఉమెన్స్ కాలేజీ, బొబ్బిలిలోని రాజా కళాశాల, గిరవిడిలోని ఎస్‌డిఎస్ కళాశాల ప్రైవేట్ వైపు మొగ్గు చూపాయి. వాటిలో సుమారు రెండు వేల మంది చదువుతున్నారు. 70 పాఠశాలల్లో 33 పాఠశాలలు ప్రైవేట్ వైపు మొగ్గు చూపాయి.చిత్తూరు జిల్లాలోని 54 పాఠశాలల్లో 49 పాఠశాలలు ప్రైవేట్‌పరం అయ్యాయి. వాటిలో సుమారు నాలుగు వేల మంది చదువుతున్నారు. వీటిలో వందలాది మంది చదువుతు న్నారు.విశాఖ జిల్లాలో 89 పాఠశాలల్లో 62 ప్రైవేట్ వైపు మొగ్గు చూపాయి. వాటిలో 9,606 మంది చదువుతున్నారు. ప్రసిద్ధి చెందిన ఎఎంఎఎల్ కళాశాల, ఎవిఎన్ కళాశాల ప్రయివేట్ వైపు మొగ్గు చూపింది.

## చుక్కల భూముల రైతుల ఇక్కట్లు

ఏలూరు, నవంబర్ 5, (న్యూస్ పల్స్) చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరక్క రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఏదైనా ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడినా ఆయా భూములు అమ్ముకోవడానికి లేకపోవడం, రిజిస్ట్రేషన్లు కాకపోతుండడం వారి పాలిట శాపంగా మారింది. నిషేధిత భూముల జాబితా 22(ఎ) నుంచి అర్హులైన వారిని తొలగించి ఆయా భూముల రిజిస్ట్రేషన్స్ చేసుకునే అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలోఆదిశగా అడుగులు పడటం లేదు. ముఖ్యమంత్రి స్థాయి నుంచిరెవెన్యూ ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించేందుకు కసరత్తు చేస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందనే వాదన కూడా లేకపోలేదు. 22(ఎ) నిషేధిత భూముల జాబితా నుంచి తమ భూములను తొలగించాలని, వినతులను పరిశీలించాలంటూ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పట్నుంచి...ఇప్పటికీ18లక్షలకుపైగాదరఖాస్తులు సిసిఎల్ఎ కార్యాలయం లో పెండింగులో ఉన్నాయి. సమస్యను పరిష్కరించేందుకు రెవెన్యూ ప్రత్యేకంగా అధీకృత వ్యవస్థ లేకపోవడం ఫైళ్లు క్లియర్ కాకపోవడానికి బలమైన కారణంగా పలువురు పేర్కొంటున్నారు. ఫైళ్లు కుప్పలు తెప్పలుగా కార్యాలయాలకు చేరుతున్నప్పటికీ వాటిని పరిశీలించేందుకు అవసరమైన స్థాయిలో సిబ్బంది లేకపోవడం ఒక కారణం కాగా, క్షేత్రస్థాయిలో అధికారులు నిషేధిత భూముల జాబితా నుంచి ఆయా భూములకు సంబంధించిన క్లియరెన్స్ ఇచ్చేందుకు సాంకేతిక కారణాలు చూపుతూ పరిష్కారానికి మొగ్గుచూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 22(ఎ) భూముల విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను సిఎం ఆదేశించినప్పటికీ ఆచరణలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. కలెక్టర్లు రెవెన్యూ స్పందన పేరుతో తహశీల్దార్ కార్యాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేసినప్పటికీ రైతులకు పెద్దగా ఉపయోగం ఏమీ లేదు. ఇటీవల గ్రామ సచివాలయాల్లో ఏర్పాటుచేసిన రెవెన్యూ స్పందన కార్యక్రమం ఓ ప్రహసనంలా ముగిసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని ఇచ్చిన వినతులకు సంబంధించి అర్జీ తీసుకున్నట్లు రసీదు ఇచ్చేందుకు కూడా సచివాలయాల సిబ్బంది సుముఖత చూపలేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఒకట్రెండు చోట్ల రసీదులిచ్చినా... ఆన్‌లైన్‌లో సమాచారాన్ని ఫీడ్ చేసి, ఆన్‌లైన్ ఐడి నెంబరును రైతులకు ఇవ్వకుండా మేన్యువల్ రసీదులు పలు ప్రాంతాల్లో ఇచ్చినట్లు సమాచారం.

## కార్పొరేషన్ పాగా పేడుతుందా

నెల్లూరు, నవంబర్ 5, (న్యూస్ పల్స్) నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. ఇక్కడ టీడీపీ పోటీకి సిద్ధమయింది. ఒంటరిగానే బరిలోకి దిగాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు అభ్యర్థుల ఎంపిక పై దృష్టి పెట్టింది. నెల్లూరు కార్పొరే షన్ ఎన్నికలు జరుగుతాయని ఎప్పటి నుంచో అందరికీ తెలుసు. అందుకే ముందుగానే టీడీపీ నేతలు కూడా మానసికంగా సిద్ధమయి పోయారు. ఇక్కడ వైసీపీకి పట్టున్నప్పటికీ గణనీయమైన స్థానాలను సాధించాలన్న లక్ష్యంతో టీడీపీ నేతలున్నారు.నెల్లూరు నగర పరిధిలో ఉన్న రూరల్, టౌన్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ గెలిచింది లేకపోయినా, వైసీపీ నేతల్లో ఉన్న విభేదాలు తమకు అనుకూలంగా మారతాయని టీడీపీ అంచనా వేస్తుంది. టీడీపీకి అభ్యర్థుల కొరత కూడా ఏమీ లేదు. అనేక మంది టిక్కెట్ల కోసం క్యూ కడుతున్నారు. ఆర్థిక భారాన్ని తామే భరిస్తామని చెబుతూ ముందుకు వస్తుండటం తో టీడీపీ నేతలలో ఉత్సాహం అలుముకుంది.నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల బాధ్యతను మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఈ ఎన్నికపై దృష్టి పెట్టారు. అభ్యర్థుల ఎంపికను ప్రత్యర్థులను బట్టి చేయాలని టీడీపీ నిర్ణయించింది. మేయర్ అభ్యర్థిని కూడా ముందుగా ప్రకటించకుండా డిజన్లలో ప్రచారాన్ని జోరుగా నిర్వహించాలని భావిస్తుంది. తమకు నెల్లూరు నగరంలో ఉన్న పట్టు ఏంటో ఈ ఎన్నిక ద్వారా నిరూపించాలనుకుంటోంది.నెల్లూరు కార్పొరేషన్ లో అభివృద్ధి తమ హయాంలోనే జరిగిందని టీడీపీ చెబుతోంది. ఎన్నడూ లేని విధంగా అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ 1500 కోట్లు ఖర్చు చేసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చారన్న విషయాన్ని గుర్తు చేస్తుంది. జనసేన, బీజేపీలు కూడా ఈ ఎన్నికల్లో తలపడనున్నాయి. మొత్తం మీద స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించిన తర్వాత టీడీపీ తొలిసారి నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో బరిలోకి దిగాలని నిర్ణయించింది.

## కర్నూలులో లెదర్ ఇండస్ట్రీస్ చిరు వ్యాపారులకు పెట్టించాలని వినతి

### నల్లా రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కేదార్ నాథ్



కర్నూలులెదర్ ఇండస్ట్రీస్ చిరు వ్యాపారులకు పెట్టించాలని లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ కు విన్నవించినట్లు

నల్లా రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కేదార్ నాథ్ పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలు పర్యటనలో భాగంగా స్థానిక కర్నూలు పున్నమి గెస్ట్ హౌస్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లిడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ ను కేదార్ నాథ్ మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క ఇచ్చి శాలువాతో సత్కరించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి లీడ్ క్యాప్ చైర్మెన్ గా రాజశేఖర్ నునియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేదార్ నాథ్ మాట్లాడారు. కర్నూలు పట్టణంలోని బుధవార పేట అతిపెద్ద దళిత వాడని, నిరక్షరాస్యత కూడా ఎక్కువ ఉన్న ప్రాంతం అని చెప్పారు. ఈ నేపథ్యంలో బుధవార పేటలో కర్నూలులో లెదర్ ఇండస్ట్రీస్ చిరు వ్యాపారులకు పెట్టించాలని కోరారు. చర్మకారులకు ఉపాధి అవకాశం కల్పించి వారి అభివృద్ధికి కృషి చేయాలనీ ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కర్నూలు శాసనసభ్యులు హఫీజ్ ఖాన్ నేపథ్యంలో ఈ కార్యక్రమంలో జస్వంత్, వసంత్, అమృత్, ఆంజనేయులు యాదవ్, నాయకులు ప్రసాద్,రాజేష్, లక్ష్మణ్,నవీన్,ఖాసిం వలి, జమ్మన్న,ఏసన్న,ప్రభుదాస్, చందు,రవి,గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

## 11వ వార్డుకు వై ఎస్ ఆర్ సి పి అభ్యర్థి నామినేషన్



బద్వేల్ మున్సిపాలిటీ 11వ వార్డుకు కౌన్సిలర్ అభ్యర్థిగా వైఎస్సార్సీపీ నుంచి శ్రీదేవి శుక్రవారం మధ్యాహ్నం నామినేషన్ దాఖలు చేశారు ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి ఉన్నారు 11వ వార్డు కు కౌన్సిలర్ గా ఎన్నికైన కె ప్రభాకర్ ఎన్నికైన కొద్ది రోజులకే మృతి చెందారు దీంతో ఈ వార్డుకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు ఇప్పటికే తెలుగుదేశం అభ్యర్థిగా మాజీ కౌన్సిలర్ సుబ్బరాయుడు సిపిఐ పార్టీ అభ్యర్థిగా జకరయ్య నామినేషన్లు దాఖలు చేశారు.

## చిత్తూరు జిల్లా మదనపల్లి వైకాపా మహిళా నేత మౌనదీక్ష..

### సీఎంతో తప్ప ఎవరితోనూ మాట్లాడబోనని నిరసన.



చిత్తూరు జిల్లాల మదనపల్లెలో వైకాపా నాయకురాలు నిరసన చేపట్టారు.పార్టీలో తనకు కనీస మర్యాద కూడా ఇవ్వటం లేదని వాపోయారు.సీఎం జగన్‌తో తప్ప తాను ఎవరితోనూ మాట్లాడబోనని భీష్మించుకుని కూర్చున్నారు.పార్టీలో గుర్తింపులేదని, స్థానిక నాయకులూ కనీస మర్యాద కూడా ఇవ్వడంలేదంటూ చిత్తూరు జిల్లా మదనపల్లెకు చెందిన వైకాపా మహిళ నాయకురాలు, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ సెల్వి నిరసనకు దిగారు.మదనపల్లె పట్టణంలోని బెంగళూరు బస్టాండ్ వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం ఎదుట మౌనదీక్ష చేపట్టారు.తాను పార్టీకి విధేయురాలునని తన సమస్యలను ముఖ్యమంత్రికి మాత్రమే తెలియజేస్తానన్నారు.సీఎం జగన్‌తో తప్ప తాను ఎవరితోనూ మాట్లాడబోనని భీష్మించుకుని కూర్చున్నారు

## వీరుడా వందనం. మీ త్యాగం మరువలేనిది

దేశం కోసం,దేశ ప్రజల శాంతి భద్రతల కోసం ప్రాణాలర్పించిన వీరుడికి అశ్రునివాళి??!!చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గంమొలకలచెరువు మండలం వేపూరికోట గ్రామం బంగారువాండ్లపల్లి కి చెందిన శ్రీమతి పెద్దావుల సరోజమ్మ ఉ లేట్ శ్రీ పెద్దావుల నారాయణరెడ్డి (ఎక్స్ సిటిఎం స్పిన్నింగ్ మిల్ ఉద్యోగి) ల కుమారుడు జమ్మూ కాశ్మీర్ లడక్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తూ అమరుడైన బి ఎ స్ ఎ ఎ, జవాన్ ఓ తీ.. కార్తీక్ కుమార్ రెడ్డినీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాం...! దేశం కోసం ప్రాణాలర్పించిన మన బిడ్డ అమరవీరుడు కి అశ్రు నివాళి.



## 7న పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నందికొట్కూరు నవంబర్ 05బ్రాహ్మణకొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988 - 1989 విద్యాసంవత్సరం లో 10వ తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 7న ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు వెంకటేశ్వర రెడ్డి, పుల్లన్న లు ఒక ప్రకటన లో తెలిపారు.శుక్రవారం వారు మాట్లాడుతూ బ్రాహ్మణ కొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వపు విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారఈసమావేశానికిపూర్వపు ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు. సమ్మేళనానికి ప్రతి పూర్వపు విద్యార్థి హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## శ్రీకాళహస్తిశివయ్య సేవలో ఆర్.కే రోజా

శ్రీకాళహస్తీశ్వరాలయూ లో నగిరి ఏమ్మేలే, చలన చిత్ర కథా నాయిక ఆర్.కే శుక్రవారూ కార్తీక మాసం మోదటి రో[illegible] కావడం తో శివుడు [illegible] అమ్మవారి ని దర్శిన[illegible] కోసం వచ్చానని ఆ[illegible] తేలిపారు .అనంతర[illegible] గురు దక్షణామూర్తి వ[illegible] వేద పండితులచే ప్రత్యే[illegible] ఆ శీ ర్వ చ న o[illegible]



తిర్థప్రసాదాలు ఆలయ అదికారులు వై.కా పా నాయకుడు లోకేష్ యదవ్, భరత్ రేడ్డి ఆమేకు ఆలయ చిత్రపటూ అందజేశారు.

# కాంగ్రెస్ భవిష్యత్తు..అంతేనా



విజయవాడ, నవంబర్ 5, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఇక ఏమాత్రం కోలుకోలేదని అర్థమయిపోయింది. బద్వేలు ఉప ఎన్నిక ద్వారా మరోసారి రుజువయింది. బద్వేలు ఉప ఎన్నికను కాంగ్రెస్ నేతలు ఎవరూ సీరియస్ గా తీసుకోలేదు. పేరుకు అనేక మంది నేతలున్నప్పటికీ బద్వేలు వైపు కాంగ్రెస్ నేతలు ఎవరూ కన్నెత్తి చూడలేదు. బద్వేలు ఉప ఎన్నిక అనుకోకుండా వచ్చింది. ఈ సమయంలో ఐక్యత ప్రదర్శించాల్సిన నేతలు షరా మామూలుగానే తమకు పట్టనట్లే వ్యవహరించారు. బద్వేలు ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుస్తుందని ఎవరూ అనుకోరు. మాజీ ఎమ్మెల్యే కమలమ్మను బరిలోకి దించారు. అభ్యర్థి ఎంపిక వరకూ బాగానే ఉన్నా ప్రచారంలో మాత్రం పూర్తిగా వెనకబడిందనే చెప్పాలి. ఇక్కడ గెలుపు కంటే బీజేపీ కంటే ఎక్కువ ఓట్లు సాధించడానికి కృషి చేయాలి. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఈ ఎన్నికల్లో చూపించుకుంటే కొద్దో గొప్పో కేంద్ర నాయకత్వానికి అయినా చెప్పుకునే వీలుంటుంది. అయితే కాంగ్రెస్ నేతలు ఆ ప్రయత్నం చేయలేదనే చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ లో అనేకమంది నేతలున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్నప్పుడు అనేక పదవులు పొందిన వారు పదుల సంఖ్యలోనే ఉన్నారు. కేవీపీ రామచంద్రరావు, నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, పల్లంరాజు, కనుమూరి బాపిరాజు వంటి నేతలున్నారు. కానీ వీరెవ్వరూ బద్వేలు ఉప ఎన్నికల ప్రచారంలో కన్పించలేదు. పార్టీ పట్ల వీరికున్న సీరియస్ నెస్ ఎంతనేది అర్థమయింది. వీరు ప్రచారానికి వస్తే పూర్తిగా సీన్ ను మారేస్తారని కాదు. ప్రచారంలో పాల్గొంటే పార్టీ క్యాడర్ లో జోష్ నెలకొంటుంది. నేతల్లో కూడా ఆత్మస్థయిర్యం దక్కుతుంది. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లకు ధీమా దొరుకుతుంది. కానీ వీరెవ్వరూ కనీసం కాంగ్రెస్ కు కొంత ఓటు బ్యాంకును సాధించిపెట్టాలన్న ప్రయత్నం చేయకపోవడం చర్చనీయాంశమైంది. టీడీపీ, జనసేన వంటి పార్టీలే తప్పుకున్నా బరిలోకి దిగిన కాంగ్రెస్ నేతల వల్లనే నవ్వుల పాలయిందన్న విమర్శలు విన్పిస్తున్నాయి

# జగన్ కు దూరమౌతున్న మేధావులు

విజయవాడ, నవంబర్ 5,(న్యూస్ పల్స్) రాజకీయాల్లో సింపతీనే ప్రధానం. పార్టీలకు అతీతంగా నేతలంతా కోరుకునేది.. కావాలని ప్రచారం చేసుకునేది కూడా సింపతీనే. ఎంత ప్రజాదరణ ఉన్న నాయకుడికైనా కూడా సింపతీ రాజకీయమే వెన్నుదన్నుగా ఉంటుంది. దేశవ్యాప్తంగా సింపతీ రాజకీయాలు ఎంతోమంది అనామకులను తిరుగులేని హీరోలను చేసింది. ఈ సింపతీతోనే ఎంతో మంది ముఖ్యమంత్రులు కూడా అయ్యారు. ఈ సింపతీ రాజకీయాలే తెలుగు గడ్డపై నాడు ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడంతో పాటు ఆయన్ను దేశవ్యాప్తంగా తిరుగులేని పొలిటికల్ హీరో అయ్యారు. ఇక అదే సింపతీ కేసీఆర్‌ను తెలంగాణలో తిరుగులేని హీరోను చేసింది. ఇక ఏపీ సీఎం జగన్‌ను సైతం ఇదే సింపతీ ఇంత త్వరగా తెలుగు ప్రజలకు కనెక్ట్ చేయడంతో పాటు ఆయన్ను సీఎంను చేసింది. జగన్ రాజకీయాల్లోకి వచ్చిన రోజు నుంచి ఆయన సీఎం అయ్యే వరకు ఈ సింపతీ రోజు రోజుకు విపరీతంగా పెరిగిపోయింది. అయితే, ఈ విషయంలో గత ఏడాది వరకు ఉన్న సింపతీని జగన్ కోల్పోతున్నారనే వాదన సర్వత్రా వినిపిస్తోంది. మరీ ముఖ్యంగా మేధావి వర్గాల్లో జగన్‌కు సింపతీ ఉంది. ఆయన సీఎం కావాలని కోరుకున్నవారు చాలా మందే ఉన్నారు. వ్యాసాలు, చర్చల ద్వారా.. మేధావులు తమ మనసులో జగన్ సీఎం కావాలని అభిలషించారు. తద్వారా సైలెంట్ ఓటు వెనుక మేధావుల పాత్ర ఉంది. అయితే, ఇప్పుడు అధికారం లోకి వచ్చిన జగన్.. మేధావులకు కడు దూరంగా ఉంటున్నారు. పైగా న్యాయవ్యవస్థ వంటి కీలకమైన రాజ్యాంగ వ్యవస్థతో ఢీ అంటే ఢీ అని ఆయన పోరుకు సిద్ధపడడంతో నిన్నమొన్నటి వరకు ఆయనను సమర్థించిన ఓవర్గం మేధావులు ఇప్పుడు ఈ విషయంలో కలుగ జేసుకునేందుకు, మద్దతుగా వ్యవహరించేందుకు వెనకంజ వేస్తున్నారు. ఇదొక పార్శ్వం అయితే.. మరో కోణంలో చూస్తే.. కీలకమైన మేధావి వర్గం జగన్ పార్టీలోకి చేరాలనుకుంది. వీరిలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ వంటివారు ఉన్నారు. ఆయన జనసేనకు రాజీనామా సమర్పించిన తర్వాత.. వైసీపీ వైపు అడుగులు వేస్తున్నారని వార్తలు వచ్చాయి. అయితే, ఇప్పుడు ఆయన విరమించుకున్నారని అంటున్నారు. అదేవిధంగా పొరుగు రాష్ట్రంలో ఉన్నప్పటికీ.. లోక్‌సత్తా సామాజిక ఉద్యమ నేత.. మాజీ ఎమ్మెల్యే , మాజీ ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ కూడా అడపా దడపా.. జగన్‌ను సమర్థిస్తూ.. కామెంట్లు చేసేవారు. ఆయన తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థను తొలిసారి అభినందించింది కూడా ఆయనే అయితే.. ఇటీవల పరిణామాలతో ఆయనకూడా మౌనం పాటిస్తున్నారు. ఇక ఉండవల్లి లాంటి మేధావులను జగన్ ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకోవాలని చాలా మంది సూచించారు. ఆయన కూడా ఒకప్పుడు జగన్‌కు దగ్గరవ్వాలనుకున్నా ఇప్పుడు జగన్ తీసుకునే నిర్ణయాలను.. ముఖ్యంగా జగన్ న్యాయవ్యవస్థతో ఢీఅంటేఢీ అనడాన్ని తప్పు పడుతున్నారు. ఇలా చాలా మంది మేధావులుజగన్‌వ్యవహార శైలితో విసిగిపోతున్నారనే టాక్ వినిపిస్తోంది.

# అనంత జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం?..

## ఆరుగురు కూలీలు అక్కడికక్కడే మృతి

## దీపావళి మరుసటి రోజు ఘోర రోడ్డు ప్రమాదం



అనంతపురం సంతోషంగా పండగ చేసుకుని మునుపటిలాగే కూలీ పనికెళు న్న ఆ ఆరుగురి కుటుంబాల్లో ఓ గుర్తు తెలియని వాహనం యమపాశమై పెనువిషాదాన్ని నింపింది. పామిడి సమీపంలో 44వ జాతీయ రహదారిపై కూలీలతో వెళ్తున్నఆటోను ఓగుర్తుతెలియనివాహనంఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో పయాణిస్తున్నఆరుగులు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో పదిమందికి తీవ్రగాయాలుఅయ్యాయి. స్థానికులు, వాహనదారులు క్షతగాత్రులను హుటాహుటిన స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. వీరిలో చాలా మంది పరిస్థితి విషమంగా వున్నట్లు సమాచారం. ఈ ఘటనలో చనిపోయిన వారు, గాయపడిన వారంతా గార్లదిన్నె మండలం కొప్పలకొండ గ్రామానికి చెందిన వారు. స్థానిక సమాచారం మేరకు పోలీసులుఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వాహనాన్ని లారీ ఢీ కొని ఉండొచ్చునిచ మద్యంమత్తులోఈఘటనజరిగి ఉండొచ్చని పోలీసుల అనుమానసీ. ఈ ప్రమాదానికి సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# సింహాచలంలో శ్రీ శారదా పీఠాధిపతులు

విశాఖపట్నం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దేవస్థానం ఉపాలయం లో కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో నక్షత్ర వనాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్తీక మాసం తొలి రోజు సందర్భంగా నెల రోజులు జరిగే కార్తీకమాస పూజలను పీఠాధిపతులు చేతులమీదుగా ప్రారంభించారు. స్వామిజీ మాట్లాడుతూ కార్తీక మాసం తొలి రోజున నా ఇష్టదైవం సింహాద్రి అప్పన్న దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఇంట్లో ఆదిశంకరాచార్యులు ఫోటో పెట్టుకుని, శంకరాచార్య నామస్మరణ చేయాలని శారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ కేదార్నాథ్ ఘటన జరిగిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రధాని చేతుల మీదుగా ఈరోజు ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో సంతోషకరమని స్వామిజీ అన్నారు.

# గోష్పాద క్షేత్రంలో భక్తుల రద్దీ

ఏలూరుపశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు పవిత్ర గోష్పాద క్షేత్రం లో కార్తీక మాసం మొదటి రోజు కావడంతో శివనామస్మరణతో శ్రీ బాల త్రిపుర సుందరి సమేత సుందరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం మారు మోగింది. అధికారులు భక్తుల కు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చక్కని ఏర్పాట్లు ఏర్పాటు చేసారు. కానీ కోవిడ్ నేపథ్యంలో ఎటువంటి భయమూ లేకుండా మాస్కులు ధరించకుండా స్వామి వారి సేవలో భక్తులు తరిస్తున్నారు.

# ఆటో బోల్తా నలుగురికి గాయాలు

గన్నవరం కృష్ణాజిల్లా గన్నవరం మండలం గొల్లనపల్లి వద్ద ప్రమాదవశాత్తు ట్రక్ ఆటో బోల్తా పడింది. ఈఘటనలో నలుగురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 లో విజయవాడ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. చాట్రాయి మండలం సిగుడిపాడు నుండి గన్నవరంలో ఓ శుభకార్యానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

# బీహార్‌లో మరో 10 మంది మృతి..

## 21కి చేరిన మృతుల సంఖ్య

గోపాల్‌గంజ్: బీహార్ కల్తీ మద్యం మరో పది మంది ప్రాణాలు తీసింది. పశ్చిమ చంపారన్ జిల్లాలోని బెట్టియ్యా పట్టణంలో కల్తీ మద్యం సేవించి 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే గోపాల్‌గంజ్‌లో కల్తీ మద్యం తాగి 11 మంది మరణించారు. ఆ ఘటనను మరువక ముందే ఇప్పుడు బెట్టియ్యాలో మరో పది మంది ప్రాణాలు పోయాయి. దాంతో బీహార్లో మూడు రోజుల వ్యవధిలో కల్తీ మద్యం సేవించి మరణించిన వారి సంఖ్య 21కి చేరింది

# తమ్ముళ్లలో ఈటల టాక్...

గుంటూరు, నవంబర్ 5, (న్యూస్ పల్స్) రెండు తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో అనేక అంశాలపై క్లారిటీని తెచ్చాయి. అధికార పార్టీలు తమ సంక్షేమ పథకాలను చూసి ఓట్లేస్తారని అనుకోవడం భ్రమేనని తేలింది. పొరుగున ఉన్న తెలంగాణ లో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నిక ఏపీ తెలుగుదేశం పార్టీలో ఉత్సాహాన్ని నింపిందనే చెప్పాలి. కుటుంబానికి పది లక్షల పథకం కూడా అక్కడ పనిచేయలేదంటే రేపు జగన్ కు కూడా ఇక్కడ అదే పరిస్థితి వస్తుందని టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. బద్వేలు ఉప ఎన్నికను సునాయాసంగా గెలవవచ్చు. అక్కడ ప్రధాన పార్టీలు ఏమీ బరిలో లేవు కాబట్టి భారీ మెజారిటీ దక్కి ఉండవచ్చు. కానీ ప్రజలను నగదు పథకాలతో కొనుగోలు చేద్దామనుకోవడం కుదరదని హుజూరాబాద్ ఉప ఎన్నిక తేల్చి చెప్పిందంటున్నారు. సమర్థత, అభివృద్ధి, సంక్షేమం వంటి వాటిని జనం నిశితంగా పరిశీలిస్తారని తెలంగాణలో అధికార పార్టీకి అర్థమయిందనే చెప్పాలి. ఇప్పుడు టీడీపీకి ఆ ఉప ఎన్నిక ఫలితంతో ఎక్కడ లేని ధైర్యం వచ్చింది. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పథకాలను ప్రవేశపెట్టారు. నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో చెప్పిన సమయానికి బదిలీ చేస్తున్నారు. ఇప్పటి వరకూ 3.5 లక్షల కుటుంబాలకు దాదాపు లక్ష కోట్లకు పైగానే జగన్ లబ్ది చేకూర్చారు. టీడీపీని భయపెడుతున్నది నేటి వరకూ భయపెడుతున్నది అదే. ప్రజలు సంక్షేమ పథకాల మోజులో పడి టీడీపీ వైపు చూడరేమోనన్న భయం ప్రతి ఒక్క టీడీపీ నేతలోనూ కన్పించింది. కానీ




స్థానిక పరిస్థితులు, నియోజకవర్గంలో నాయకత్వం పనితీరు, ప్రజల్లో వారిపై ఉన్న నమ్మకం వంటివి సంక్షేమ పథకాలను కాదు గదా, కోట్లు కుమ్మరించినా గెలవలేరన్న విషయం హుజూరాబాద్ తో స్పష్టమయింది. ఇప్పుడు ఏపీలో జగన్‌కూడాపునరాలోచించుకోవాల్సి ఉంటుంది. అభివృద్ధి పనులు, ఉపాధి అవకాశాల మెరుగుదల, పారిశ్రామికీకరణ వంటి వాటిపై దృష్టి పెట్టకపోతే.. టీడీపీలో ప్రతి నేతా ఈటలగా మారగలడన్న విషయాన్ని గుర్తించాలి. అయితే జగన్ కు ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో కేవలం సంక్షేమమే కాకుండా ప్రజల మనసులను మరింతగా గెలచుకునే అవకాశం ఉంది. కానీ హుజూరాబాద్ ఉప ఎన్నిక ఫలితాలతో టీడీపీలో జోష్ కన్పిస్తుంది

# వ్యవసాయ బాటలో రఘువీరారెడ్డి



అనంతపురం, నవంబర్ 5, (న్యూస్ పల్స్) సీనియర్ నేత, మాజీ మంత్రి రఘువీరరెడ్డి రాజకీయాలు మానేసి స్వగ్రామంలోనే ఉంటున్నారు. ఆయన పూర్తిగా పల్లె వాతావరణానికి అలవాటు పడ్డారు. సేద్యం, పశువుల పెంపకంతో రఘువీరారెడ్డి కాలక్షేపం చేస్తున్నారు. దాదాపు మూడేళ్లుగా అనంతపురం జిల్లాలోని నీలకంఠాపురంలోనే ఆయన నివాసం ఉంటున్నారు. కుమార్తె, కుమారులకు తన వ్యాపారాలను అప్పగించేసి పూర్తిగా పల్లె గాలిని పీల్చుకుంటున్నారు. అయితే ఇందులో రఘువీరారెడ్డి గొప్పతనం ఏమీ లేదంటున్నారు. రఘువీరా దశాబ్దాల కాలాల పాటు రాజకీయాలు చేశారు. మంత్రిగా పనిచేశారు. పల్లె వాసనలు ఆయనకు కొత్తేమీ కాదు. అలాగే ఎండా, వానలు కూడా ఆయనను ఎప్పుడూ పలకరిస్తూనే ఉంటాయి. అన్నీ వదిలేసి తన సొంతగ్రామమైన నీలకంఠాపురం ఉంటున్నారు. ఆయన పెద్దగా ఇబ్బంది పడరు. కానీ ఆయన భార్య సునీతను మాత్రం మెచ్చుకోకుండా ఉండలేం. ఉన్నత కుటుంబంలో జన్మించిన సునీత రఘువీరారెడ్డితో కలసి మూడు దశాబ్దాలకు పైగానే ప్రయాణం చేశారు. రాజకీయ నాయకుడు కావడంతో ఎక్కువ కాలం సునీత హైదరాబాద్ లోనే ఉన్నారు. ఏసీ గదులు, విలాసవంతమైన జీవితాన్ని సునీత గడిపారు. కుమార్తె, కుమారుడు కూడా ఎదగడం, వ్యాపారాల్లో స్థిరపడటంతో ఆమెకు కష్టమనేది తెలియదు. ఇప్పుడు సునీత నీలకంఠాపురంలో సాధారణ జీవితాన్ని గడుపుతున్న తీరు అందరినీ ఆశ్చర్య చకితులను చేస్తుంది. రఘువీరారెడ్డి కి తెలిసిన కష్టాలు సునీతకు తెలియవు. అయినా ఆమె కొన్నేళ్లుగా నీలకంఠాపురంలోనే ఉంటూ ఆయనకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. ఏసీ కార్లలో తిరిగిన సునీత ఇప్పుడు చిన్న మోపెడ్ లో ప్రయాణించడం ఆమె సామాన్య జీవితానికి అద్దంపడుతుంది. మొత్తం మీద రఘువీరారెడ్డి అన్నీ వదిలేసి వ్యవసాయంలో ఆనందాన్ని వెతుక్కుంటున్నా, భర్త వెంటే నడుస్తూ అండగా ఉన్న సునీతను మాత్రం మెచ్చుకోకుండా ఉండలేం

# మళ్లీ లాక్ డౌన్ దిశగా చైనా




బీజింగ్, నవంబర్ 5 కరోనా వైరస్ పుట్టినిల్లు చైనాలో ఈ వైరస్ విజృంభణ తగ్గినట్లే తగ్గి.. మళ్ళీ కేసుల నమోదు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ దేశంలో క్రమంగా కరోనా బాధితుల సంఖ్య పెరుగుతుంది. దీంతో డ్రాగన్ కంట్రీ తమ దేశ ప్రజలను అలెర్ట్ చేసింది. లాక్ డౌన్ దిశగా అడుగులు వేస్తుంది. దీంతో తమ దేశంలోని ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని.. నిత్యావసర వస్తువులను నిల్వజేసుకోవాలని సూచించింది. కోవిడ్ వెలుగు చూస్తున్న పట్టణాల్లో నిబంధనలు మరింత కఠిన తరం చేస్తుంది. సరిహద్దులు మూసివేస్తుంది. క్వారంటైన్ అమలు చేస్తుంది. లాక్ డౌన్ విదిస్తుంది. అయితే గత కొంతకాలంగా చైనా ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదని తెలుస్తోంది. ఆ దేశంలోని భారీ వర్షాలు వరదలకు పంటలు తీవ్రంగా నష్టపోయాయి. దీంతో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటున్నయి. పర్యావరణ మార్పులు ఈ పరిస్థితిని మరింత దిగజార్చే అవకాశం ఉందంటూ ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ముందుగా ఆహార నిల్వల కోసం హెచ్చరిస్తుందని మరో టాక్‌ఆం కూడా వినిపిస్తోంది. ఇక కరోనా వైరస్ ప్రావిన్సులో మళ్ళీ వెలుగులోకి వచ్చింది. తొంభై రెండు కొత్త కేసులు సోమవారం నమోదయ్యాయి. ఇది సెప్టెంబర్ మధ్య నుండి అత్యధికం. దీంతో మళ్ళీ ప్రభుత్వం అప్రమత్తమైంది.. కొవిడ్ విషయంలో జీరో టోలరెన్స్ విధానాన్ని అనుసరిస్తోన్న చైనా.. కేసులు ఏ మాత్రం పెరుగుతున్నాయని అనిపించినా, తక్షణ చర్యలకు ఉపక్రమిస్తోంది. ప్రభుత్వం కొన్ని అంతర్-ప్రాంతీయ ప్రయాణాలపై ఆంక్షలు విధించింది. కరోనా పరీక్షలను వేగవంతం చేసింది. వివాహాలు, విందులు వంటి సామాజిక సమావేశాలను వాయిదా వేయమని ప్రజలను కోరింది. సరిహద్దుల మూసివేత, లాక్‌డౌన్లు, సుదీర్ఘ క్వారంటైన్లు అమలు చేస్తోంది. ఫిబ్రవరిలో వింటర్ ఒలింపిక్స్‌కు ఏమాత్రం ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ఈసారి మరింత కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. షాంఘై డిస్నీల్యాండ్ థీమ్ పార్క్ ఆదివారం రాత్రి నుండి తాత్కాలికంగా మూసివేసింది. అంతేకాదు సందర్శకులు, పార్క్ సిబ్బందిని కోవిడ్ పరీక్ష నిర్వహించింది.

# అటకెక్కిన కొత్త నియోజకవర్గాలు...

నెల్లూరు, నవంబర్ 5, (న్యూస్ పల్స్) ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. అయితే నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనను ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆ ఊసే ఎత్తడం లేదు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో నియోజకవర్గాలను పెంచాల్సి ఉంది. వాస్తవానికి మొన్నటి ఎన్నికలకు ముందే నియోజకవర్గాల పెంపు జరగాల్సి ఉన్నా జరగలేదు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం 175 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటికి మరో యాభై నియోజకవర్గాలు పెంచాలన్న ప్రతిపాదన ఉంది. అంటే మొత్తం 225 నియోజకవర్గాలు అవుతాయి. అయితే ఈ ప్రతిపాదన ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం వద్దనే పెండింగ్ లో ఉంది. పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉన్నా కొత్త అసెంబ్లీ స్థానాల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రాష్ట్రం విడిపోయి ఆరేళ్లు కావస్తున్నా ఈ ప్రతిపాదనను మాత్రం కేంద్రం పక్కన పెట్టేసింది. 2008 లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. నిజానికి 2026 నాటికి అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాల్సి ఉంది. కానీ విభజన చట్టంలో ఉండటంతో నియోజకవర్గాల పెంపు చేస్తారని భావించారు. నిజానికి జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాల విభజన సమయంలో ఈ అంశం తెరపైకి వచ్చినా కేంద్ర ప్రభుత్వం మాత్రం తెలుగు రాష్ట్రాల నియోజకవర్గాల పెంపు విషయాన్ని లైట్ గా తీసుకుంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే నియోజకవర్గాల పెంపు కోసం ప్రయత్నం చేశారు. 23 మంది వైసీపీ శాసనసభ్యులను పార్టీలోకి చేర్చుకోవడంతో పెంపు తప్పదని భావించి ఆయన ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ఇదే విషయాన్ని ప్రస్తావించేవారు. ఇప్పుడు జగన్ కూడా తన ఢిల్లీ పర్యటనలో ఇదే అంశాన్ని చేర్చారని తెలిసింది. అయితే నియోజకవర్గాల పెంపు విషయంలో మాత్రం కేంద్ర ప్రభుత్వం మాత్రం నియోజకవర్గాల పెంపు పట్ల ఆసక్తి కనపర్చడం లేదని తెలుస్తోంది. అయితే ఎన్నికల కు ఇంకా సమయం ఉండటంతో పెంపు జరిగి తీరుతుందని వైసీపీ నేతలు అంటున్నారు

# రైల్వే స్టేషన్ లో పోలీసుల తనిఖీలు

ఏలూరుపశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణాను అరికట్టే చర్యలో భాగంగా పోలీసు జాగిలాల సేవలను వినియోగించుకుంటున్నారు. ఏలూరుటౌన్ పోలీసులు ఏలూరు రైల్వే స్టేషన్ మరియు అర్.టి.సి బస్ స్టేషన్ లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జాగిలాల సహాయంతో రైల్వే, ఆర్టీసీ ప్రయాణికులను సోదా చేసారు. గంజాయి రవాణా, అక్రమ మద్యం, నాటు సారాయి, నిషేధిత పాన్ పారగ్, ఖైనీ, గుట్కా మరియు ఇతర నిషేధిత పదార్థాల రవాణా నియంత్రించడం కోసం ఈ తనిఖీలు చేసారు. జిల్లా వ్యాప్తం గా రైల్వే స్టేషన్, అర్.టి.సి బస్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు.

# టీడీపీ ట్రాప్ లో వైసీపీ పడుతుందా...?

విజయవాడ, నవంబర్ 5, (న్యూస్ పల్స్) చంద్రబాబు 2019 ఎన్నికలకు ముందు వైసీపీ ట్రాప్ లో పడ్డారు. ఈ విషయం చెప్పింది ఎవరో కాదు. స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటులో ఈ విషయాన్ని ప్రస్తావించారు. వైసీపీ ప్రత్యేక హోదాపై రెచ్చగొట్ట డం, తరచూ ప్రధాని కార్యాలయంలో వైసీపీ నేతలు కనిపిస్తుండటం వంటి వాటితో చంద్రబాబు ఉడికిపోయారు. ఫలితంగా చంద్రబాబు ఇంకా ఎన్నికలు ఏడాదిన్నర మిగిలి ఉన్న సమయంలో బీజేపీతో స్నేహానికి బై బై చెప్పేశారు. మంత్రి వర్గం నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు జగన్ ఆ తప్పు చేయదలచుకోలేదు. జగన్ అసలు కేంద్ర ప్రభుత్వంలోనే చేరలేదు. బయట నుంచి బీజేపీకి మంచి మద్దతుదా రుగా నిలిచారు. ఇప్పుడు చంద్రబాబు అసలు లక్ష్యం జగన్ ను బీజేపి నుంచి బయటకు రప్పించడమే. అందుకే తరచూ ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు లేఖలు రాస్తున్నారు. టీడీపీ నేతలు తరచూ ఢిల్లీ వెళ్లి కేంద్రంలోని పెద్దలను కలుస్తున్నారు. ఈ పరిణామాలతో వైసీపీ తనంతట తానే బీజేపీ స్నేహం నుంచి బయటకు వస్తుందన్నది చంద్రబాబు వ్యూహం. కానీ జగన్ మాత్రం చంద్రబాబు ట్రాప్ లో పడే అవకాశం కన్పించడం లేదు. తొలి నుంచి బీజేపీతో అంతే దూరాన్ని జగన్ మెయిన్ టెయిన్ చేస్తున్నారు. అప్పుడప్పుడూ ఢిల్లీ వెళ్లి రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధాని, కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీని శత్రువుగానే జగన్ చూస్తున్నారు. చంద్రబాబు ను నమ్మేందుకు బీజేపీ పెద్దలు సిద్ధంగా లేరన్నది జగన్ నమ్మకం. అందుకే టీడీపీ నేతలు ఎంత రెచ్చగొట్టినా నవ్వుతూనే బీజేపీతో మిత్రత్వం కొనసాగిస్తున్నారు. నిజానికి జగన్ కు, బీజేపీకి అసలు సంబంధమే లేదు. బయట నుంచి జగన్ బీజేపీకి మద్దతు తెలుపుతున్నారు. చంద్రబాబు మాదిరి కేంద్రంలో భాగస్వామ్యం కాలేదు. అందువల్ల జగన్ బీజేపీ నుంచి బయటపడే అనే ప్రశ్న ఉత్పన్నం కాదంటున్నారు. మరోవైపు బీజేపీ కూడా జగన్ ను నమ్ముకుంది. ఎంత కాదన్నా పది నుంచి పదిహేను స్థానాలను జగన్ దక్కించుకుంటారని, కాంగ్రెస్ ను ద్వేషించే జగన్ తమకు మద్దతుదారుగానే ఉంటారని, చంద్రబాబులా అభిప్రాయా లను మార్చుకోరని బీజేపీ భావిస్తుంది. మొత్తం మీద చంద్రబాబు వైసీపీని ట్రాప్ చేయాలని చూస్తున్నారు.

# పక్క రాష్ట్రాల యందు పెట్రోల్ డీజల్ పై సుంఖం తగ్గించిన విధంగా మన రాష్ట్రంలో కూడా తగ్గించాలి

## సీపీఐ నాయకులు బాబా పక్రుద్దిన్. కె ప్రసాద్ డిమాండ్ చేశారు




నంద్యాల నవంబర్ 5, ( విభారె) :- నంద్యాల పట్టణంలో శుక్రవారం నాడు విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒకే సంవత్సరంలోనే 36 రూపాయలు పెంచి 5,10 రూ తగ్గించడం సబబు కాదని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించిన సీపీఐ నంద్యాల నియోజకవర్గ,పట్టణ కార్యదర్శులు బాబా ఫక్రుద్దీన్,ప్రసాద్ రోజుకు రోజుకు పెరుగుతున్న వంట గ్యాస్ ధరలు-మల్లి 10 సంవత్సరాలు ప్రజానికాన్ని వెనక్కు నెట్టేసిన మోడీ,జగన్ ప్రభుత్వాలను దుయ్యబట్టారు. కట్టెల కోసం కొండ బాట పడుతున్న నిరుపేద కుటుంబాలు. మల్లి కట్టెల పొయ్యి మీద అన్నం వండుకునే పరిస్థితుల్లోకి ప్రజలను నెట్టేస్తున్న ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పెంచిన పెట్రోల్,డీజల్,వంట గ్యాస్ ధరలు,నిత్యావసర ధరలను తగ్గించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఎఐకే యస్ . కార్యదర్శి సోమన్న, బికే యమ్ యు . కార్యదర్శి సుబ్బారాయుడు,సీపీఐ నంద్యాల పట్టణ సహాయ కార్యదర్శి షరీఫ్ బాషా, ఏఐయస్ ప్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయుడు పాల్గొన్నారు.

# డ్రైనేజి నిర్మాణ పనులు వేగవంతం చేయండి

## నాలుగు గంటల పాటు నగరంలో కలియదిరిగిన కమిషనర్

తిరుపతి, నవంబర్ 5, ( విభారె) నగరంలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ గిరీషా అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడ కూడా వర్షపు నీరు నిలవకుండా కమిషనర్ చర్యలు తీసుకుంటున్న విషయం విదితమే. అందులో భాగంగానే వర్షపునీరు సజావుగా వెళ్లేందుకు చేయాల్సిన ఏర్పాట్ల పై శుక్రవారం కమిషనర్ అధికారులతో కలిసి నాలుగుగంటల పాటు నగరంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యంగా లీలామహల్ కూడలి, కరకంబాడీ రోడ్డు, తిరుమల బై పాస్ రోడ్డు, శ్రీనివాసం, రేణిగుంట రోడ్డు, లక్ష్మీపురం కూడలి, శ్రీనివాస కళ్యాణ మండపాలు తదితర ప్రాంతాల్లో గల డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. లీలామహల్ కూడలి వద్ద డ్రైనేజి కాలువ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తే మధురా నగర్, చేపల మార్కెట్ పైనుండి వచ్చే నీరు సజావుగా వెళ్తాయన్నారు. అలాగే లీలామహల్ నుండి కరకంబాడీ మార్గంలో ఇరువైపులా జరుగుతున్న డ్రైనేజి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. లీలామహల్ కూడలి వద్ద డ్రైనేజీ నిర్మాణానికి అడ్డుగా ఓ దుకాణం వారితో మాట్లాడి కొంత స్థలం తీసుకోవడంతో ఇబ్బంది తొలగింది. వారికి నష్టపరిహారం అప్పటికప్పుడే అందించారు. నగర అభివృద్ధికి ప్రతి ఒక్కరు ఇలా సహకరించాలన్నారు. అక్కడక్కడా శ్రీనివాస సేతు నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు వెంటనే తొలగించాలని ఎస్పీడిసిఎల్ అధికారులు ఆదేశించారు. లక్ష్మీపురం కూడలి వద్ద నీరు సజావుగా వెళ్లేందుకు 3 అడుగుల మేర డ్రైన్ నిర్మాణం చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడా కూడా నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద డ్రైనేజి పై ర్యాంప్ నిర్మాణం చేస్తుండగా ఆపివేయించారు. డ్రైనేజీ పై అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చూడాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఎస్పీడిసిఎల్ అధికారులు రమణ, పద్మనాభ పిళ్ళై, బాలాజీ, ఏ. సి.పి. 2 షణ్ముగం, అప్కాన్స్ ప్రతినిధి స్వామి తదితరులు ఉన్నారు.

# ముగిసిన నామినేషన్ల ఘట్టం

బేతంచెర్ల నవంబర్ 5, ( విభారె)పట్టణంలో జరుగుతున్న నగర పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం శుక్రవారం ముగిసింది.పట్టణంలోని మొత్తం 20 వార్డులకు గాను నామినేషన్లు ముగిసే సమయానికి అధికార పార్టీ వైసీపీ 41, టీడీపీ 64 ,బీజేపీ 09,జనసేన పార్టీ 10,సిపిఎం 04,ఇండిపెండెంట్లు 03 నామినేషన్లు దాఖలు చేశారు.కాగా శనివారం నామినేషన్ల పరిశీలన పక్రియ,8 వ తేదీ లోగా నామినేషన్ల ఉపసంహరణ,15 వ తేదీ ఓటింగ్,17 న కౌటింగ్ అదే రోజున ఫలితాలు వెలువడనున్నాయి.కాగా బేతంచెర్ల పట్టణం నగర పంచాయతీ గా అప్ గ్రేడ్ అయిన తర్వాత మొదటి సారి జరుగుతున్న ఎన్నికలు కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొనడం గమనార్హం

# 104 సేవలను వినియోగించుకోండి

గోనెగండ్ల మండలకేంద్రమైన గోనెగండ్ల లోని రెండవ సచివాలయం పరిధిలోని కుటుంబాలకు శుక్రవారం వైద్యసేవలు అందించడానికి104 వాహనం వచ్చింది. ఈ సందర్భంగా సర్పంచ్ పూజారి హైమావతి మాట్లాడుతూప్రతినెలకు ఒకసారి 104 వాహనం సచివాలయాల ప్రకారం వచ్చి వైద్యసేవలు అందిస్తుంది

# సుఖంగా నిద్రపోవాలంటే ఈ పోషకాంశాలు తప్పనిసరిగా తీసుకోవాలి




నిద్రను అదృష్టంగా పరిగణించవచ్చు. మనస్సు మరియు ఆనందించే నిద్ర దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. ఇది చూసిన మన పెద్దలు, 'కంగారుపడనివాడు శాంతితో నిద్రపోతాడు' అనే సామెత వాడారు. కానీ నిద్ర అనేది ఆందోళనకు కారణం కాకూడదు, కానీ శరీరంలో కొన్ని విటమిన్లు లేకపోవడం. కాబట్టి, మీరు నిద్రలేమితో బాధపడుతుంటే, మీ ఆరోగ్యాన్ని చెక్ చేయడం మరియు పోషక లోపం ఏదైనా ఉందో లేదో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఆలస్యంగా నిద్ర వస్తుంది: మీరు ఈ కథనాన్ని రాత్రి రెండు గంటలకు చదువుతుంటే, ఈ సమయంలో మీరు మాత్రమే మేల్కొని ఉన్నారని తెలుసుకోండి. చాలా మంది నిద్రలేమి లేదా నిద్ర లేకపోవడం లేదా నిద్రలో లేచి నడవడం వంటి సమస్యతో బాధపడుతున్నారు.కానీ నిద్ర లేమి అనారోగ్యం యొక్క లక్షణం, ఇది కొన్ని వ్యాధుల ప్రమాదాన్ని మరియు ముఖ్యంగా మానసిక ఒత్తిడిని పెంచుతుంది. స్లీప్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక నివేదిక ప్రకారం, రాత్రికి ఏడు గంటల కన్నా తక్కువ నిద్రపోవడం మీ మరణ అవకాశాలను రెట్టింపు చేస్తుంది మరియు ఆరు గంటల కన్నా తక్కువ నిద్రపోయేవారి ద్వారా మరణించే అవకాశాలను పెంచుతుంది. నిద్రలేమికి కొన్ని పరోక్ష కారణాలు నిద్రలేమికి కొన్ని పరోక్ష కారణాలు ఉన్నాయి. వీటిలో పనిపై ఒత్తిడి, అర్ధరాత్రి పని చేయలేకపోవడం మరియు నిద్రపోయేటప్పుడు స్మార్ట్‌ఫోన్‌కు బానిస. డాక్టర్ కూపర్ విటమిన్ సొల్యూషన్ పుస్తకానికి సహ రచయిత మరియు ఇంటర్న్. ఏరియల్ లెవిటన్ ప్రకారం, సాధారణంగా నిద్రలేమి విటమిన్ లోపానికి కారణమవుతుందనే వాస్తవాన్ని చాలా మంది విస్మరిస్తారు. మన ఆరోగ్యానికి అనేక రకాల పోషకాలు అవసరం, మరియు ఇవన్నీ సంపూర్ణ మరియు సౌకర్యవంతమైన నిద్రను పొందడం సాధ్యమే. మీకు నిద్రించడానికి ఇబ్బంది ఉంటే, నేటి వ్యాసంలో చెప్పిన సమాచారం సహజంగా ఈ సమస్యను తగ్గించడానికి సహాయపడుతుంది. రండి, చూద్దాం: రాజూనీనిబనీతీవట విటమిన్ సి రోగనిరోధక వ్యవస్థలో విటమిన్ సి పాత్ర చాలా ఉత్తమమైనది. నిద్ర అవసరం అని ఇంతకు ముందే మీకు తెలుసా? 2014 లో ఖబూరా రాజౌఇ పత్రికలో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, వారి రక్తంలో విటమిన్ సి తక్కువ స్థాయిలో ఉన్నవారు నిద్రించడానికి ఇబ్బంది పడుతున్నారు మరియు రాత్రి సమయంలో చాలా సార్లు మేల్కొంటారు. కాబట్టి నిద్రలేమి ఉన్నవారికి వారి ఆహారంలో తగినంత విటమిన్ సి ఉండాలి. ఐరన్ ప్రతి కణానికి రక్తంలో ఆక్సిజన్ పంపిణీ కావాలంటే, రక్తంలో తగినంత ఇనుము ఉండాలి. ఇనుము లేని ఎర్ర రక్త కణాలు కూడా కూలిపోతాయి, తద్వారా వాటి పనితీరును ప్రభావితం చేస్తుంది. దీన్ని రక్తహీనత అంటారు. రక్తహీనత ఉన్నవారు త్వరగా అలసిపోతారు మరియు దృఢత్వం ఉండదు. కొంతమందికి రెస్ట్‌లెస్ లెగ్ సింగ్రోమ్ ఉండవచ్చు. సమస్య కాలులో ఒక చిన్న సూది కుట్లు మరియు ఈ అనుభవం మంచానికి వెళ్ళదు. అందువల్ల, ఇనుము అధికంగా ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. 'పాపాయి ది సెయిలర్ మ్యాన్' అనే కార్టూన్ చూసిన వారికి, ఆకుకూరలు తిన్న వెంటనే పాపాయి పాలక్ బలంగా ఎదగడం చూడటం ఫన్నీగా ఉంటుంది. కానీ వాస్తవానికి పాలక్ ఆకుకూరల్లో ఐరన్ కంటెంట్ రక్తం పని చేయడానికి సహాయపడుతుంది. డాక్టర్ లెవిటన్ తోటి మరియు ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్. రోమి బ్లాక్ ప్రకారం, ఇనుము లోపం సాధారణం. ఈ లోపం ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మీకు ఐరన్ కంటెంట్ ఉంటే, మీరు పాలక్, కాయధాన్యాలు, కాలేయం, చిక్కుళ్ళు, ఎర్ర మాంసం, గుమ్మడికాయ గింజలు, క్వినోవా, టర్కీ చికెన్ వంటి పాల ఉత్పత్తులను తినవచ్చు. మీకు ఇనుము లోపం ఉంటే, ఇనుము కలిగిన అదనపు మందులు తీసుకోవాలని

మీ డాక్టర్ మీకు సలహా ఇవ్వవచ్చు.

మెగ్నీషియం మెలటోనిన్ ఉత్పత్తి చేయడానికి మెగ్నీషియం అవసరం, ఇది మాకు నిద్రించడానికి సహాయపడుతుంది. ఇది కండరాల తిమ్మిరి నుండి ఉపశమనం పొందటానికి సహాయపడుతుంది మరియు వాటిని సంతోషంగా కప్పివేస్తుంది. గామా-అమినోబ్యూట్రిక్ యాసిడ్-గాబా ఉత్పత్తికి మెగ్నీషియం కూడా అవసరం. ఇదే మన నాడీ వ్యవస్థకు సహాయపడుతుంది అని డాక్టర్ డా. కరోలిన్ డీన్ చేత. ఒక సర్వే ప్రకారం, డెబ్బై-ఐదు మందికి పైగా అమెరికన్ పౌరులు నిద్రలేమితో బాధపడుతున్నారు, ఎందుకంటే వారు రోజుకు అవసరమైన కనీస మెగ్నీషియంను తినరు. మాకు రోజూ 600 మిల్లీగ్రాముల మెగ్నీషియం అవసరం, ఇది మెగ్నీషియం సిట్రేట్ పౌడర్‌గా లభిస్తుంది. ఈ లోపాన్ని కొద్దిగా నీటితో కలపడం ద్వారా సులభంగా తీర్చవచ్చు. మీకు మూత్రపిండ వైఫల్యం ఉంటే లేదా తక్కువ రక్తపోటు మరియు నెమ్మదిగా హృదయ స్పందన రేటు ఉంటే, మీరు వాటిని తినకూడదు.

## యరపతినేని కి సవాల్ విసిరిన ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

గుంటూరు నవంబర్ 5, ( విభారె)టీడీపీ నేత యరపతినేని కి ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి సవాలు విసిరారు. తెలుగుదేశం నాయకులు అభివృద్ధి చేశామని చెప్పుకుంటారే కానీ వాళ్లు చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించదు. గురజాల నియోజకవర్గం ఎవరు హయాంలో అభివృద్ధి జరిగిందో మేము బహిరంగ చర్చకు రెడీగా ఉన్నామని అయన అన్నారు. ఏ సెంటర్ కి రమ్మంటారో చెప్పండి ఆ సెంటర్ కు నేనొక్కన్నే వస్తా... అభివృద్ధిపై లెక్కలు తేల్చుకుందాం రండి. తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకుంటున్నారని తప్పుడు ప్రాచారం చేశారు. ఇవాళ తెలుగుదేశం, జనసేన అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. మేము వారి నామినేషన్లు అడ్డుకుంటే ఇన్ని నామినేషన్లు దాఖలు చేసేవారా...? చంద్రబాబు నలభై సంవత్సరాల రాజకీయ చరిత్రలో గురజాల నియోజక వర్గానికి చేసిందేమీ లేదు.

# నాని ఆఫర్ ని సామ్ రిజెక్ట్ చేసిందా..?



దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నేచురల్ స్టార్ నాని "దసరా" అనే చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలంగాణ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటిస్తోంది. అయితే ఇందులో మరో కీలకమైన పాత్ర కోసం స్టార్ హీరోయిన్ సమంత సంప్రదిస్తున్నారని వార్తలు వచ్చాయి.ఇప్పటికే నాని తో కలిసి రెండు సినిమాల్లో నటించిన సమంత.. ముచ్చటగా మూడోసారి నటించే అవకాశం ఉందని.. 'దసరా' లో కీ రోల్ లో యాక్ట్ చేయడానికి అంగీకారం చెప్పే యోచనలో ఉందని చెప్పుకున్నారు. ఇదే జరిగితే అక్కినేని నాగచైతన్య తో విడాకుల ప్రకటన తర్వాత సామ్ సైన్ చేసిన ఫస్ట్ తెలుగు ప్రాజెక్ట్ ఇదే అయ్యేది. అయితే తాజాగా సోషల్ మీడియాలో వినిపిస్తున్న టాక్ ప్రకారం సమంత ఈ ఆఫర్ ని రిజెక్ట్ చేసిందట.ఆల్రెడీ మెయిన్ హీరోయిన్ గా కీర్తి సురేష్ ని తీసుకోవడంతో.. సెకండ్ లీడ్ హీరోయిన్ గా నటించడానికి సమంత సుముఖత వ్యక్తం చేయలేదట. అలాంటి చిన్న పాత్రకు తను అవసరం లేదని భావించిందట. దీంతో ఇప్పుడు మేకర్స్ ఈ పాత్ర కోసం మీడియం రేంజ్ హీరోయిన్ కోసం వెతుకుతున్నారని.. త్వరలోనే ఆ హీరోయిన్ పేరును ప్రకటిస్తారని టాక్ వినిపిస్తోంది.కాగా 'దసరా' సినిమాతో సుకుమార్ శిష్యుడు శ్రీకాంత్ ఓదెల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలోని యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో నాని గజదొంగ గా కనిపిస్తారని సమాచారం. హీరోహీరోయిన్లు ఇద్దరూ ఇందులో డీ గ్లామర్ రోల్స్ ప్లే చేస్తున్నారు.ఇప్పటికే విడుదలైన 'దసరా' అనౌన్స్ మెంట్ వీడియో ఆకట్టుకుంది. 'ఈ దసరా నిరుడు లెక్కుండది.. బాంచత్' అంటూ నాని తెలంగాణ యాసలో డైలాగ్ చెప్పారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతం సమకూరుస్తున్న ఈ సినిమాకి సత్యన్ సూర్యన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్ గా వర్క్ చేయనున్నారు.

# దీపావళి బాక్సాఫీస్ వద్ద త్రిముఖ పోటీ..!

కరోనా సెకండ్ వేవ్ నేపథ్యంలో కుదేలైన టాలీవుడ్ బాక్సాఫీస్ మళ్ళీ పుంజుకుంటోంది. ఎప్పటిలాగే వారానికో అర డజను సినిమాలతో థియేటర్లు కళకళలాడుతున్నాయి. 'లవ్ స్టోరీ' తో మొదలుకుని గత శుక్రవారం వరకు విడుదలైన క్రేజీ సినిమాలన్నీ వసూళ్ల పరంగా పర్వాలేదనిపించాయి. ఇప్పుడు దీపావళి సందర్భంగా మూడు సినిమాలు టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. అందులో రెండు తమిళ డబ్బింగ్ సినిమాలు ఉంటే ఒక స్ట్రెయిట్ తెలుగు మూవీ ఉంది. 'మంచి రోజులు వచ్చాయి' 'పెద్దన్న' 'ఎనిమీ' సినిమాలు రేపు థియేటర్ లోకి వస్తున్నాయి.సక్సెస్ ఫుల్ డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో సంతోష్ శోభన్ - మెహ్రీన్ హీరోహీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'మంచి రోజులొచ్చాయి'. వాస్తవ సంఘటన ఆధారంగా




మారుతి తరహా ఎంటర్టైన్మెంట్ తో ఈ సినిమా సిద్ధమైంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు - టీజర్ - ట్రైలర్ సినిమాపై బజ్ క్రియేట్ చేశాయి. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ - అల్లు అర్జున్ వంటి హీరోల సపోర్ట్ కూడా దీనికి అదనపు అడ్వాంటేజ్. ఈరోజు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఏర్పాటు చేస్తున్న పెయిడ్ ప్రీమియర్ షోలు హౌస్ ఫుల్ అవడం శుభసూచకంగా కనిపిస్తోంది. యువీ కాన్సెప్ట్స్ మరియు మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ మీద వి సెల్యులాయిడ్ - జాఐఔ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం సమకూర్చారు.సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా సిరుతై శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా "అన్నాత్తే". ఇందులో రజినీ సోదరిగా కీర్తి సురేష్ నటించగా.. నయనతార - మీనా - ఖుష్బూ కీలకపాత్రల్లో కనిపించనున్నారు. ఫ్యామిలీ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రూపొందిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. తెలుగులో ఏషియన్ సినిమాస్ నారాయణదాస్ కె. నారంగ్ మరియు సురేష్ బాబు కలిసి "పెద్దన్న" పేరుతో రిలీజ్ చేస్తున్నారు. డి.ఇమ్మాన్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు.కోలీవుడ్ స్టార్ హీరోలు విశాల్ - ఆర్య కలిసి నటించిన హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ "ఎనిమీ". ఆనంద్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో 'గద్దల కొండ గణేష్' ఫేమ్ మృణాళిని రవి - మమతా మోహన్ దాస్ కీలక పాత్రలు పోషించారు. మినీ స్టూడియోస్ పతాకంపై వినోద్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'వాడు - వీడు' వచ్చిన పదేళ్ల తర్వాత విశాల్ - ఆర్య స్క్రీన్ షేర్ చేసుకుంటున్న సినిమా ఇది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ విశేషంగా అలరించింది. ఎస్.ఎస్ థమన్ ఈ చిత్రానికి సాంగ్స్ కంపోజ్ చేయగా.. శ్యామ్ సీఎస్ బ్యాగ్రౌండ్ స్కోర్ సమకూర్చారు.ఇలా టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద త్రిముఖ పోటీ ఏర్పడింది. పాజిటివ్ టాక్ తెచ్చుకుంటే నాలుగు రోజుల లాంగ్ వీకెండ్ లో భారీ ఓపెనింగ్స్ రాబట్టే అవకాశం ఉంది. మరి వీటిలో ఏది ప్రేక్షకాదరణ దక్కించుకుని దీపావళి విన్నర్ గా నిలుస్తుందో చూడాలి.

# రాజమౌళి నోట ఫ్లాప్ మాట... ?

ఆయన దర్శక ధీరుడు. తెలుగు సినిమాను అతి గొప్ప మలుపు తిప్పిన సినీ యోధుడు. బాహుబలితో తెలుగు ఖ్యాతిని ఎక్కడితో తీసుకుపోయిన నైపుణ్యం ఆయన సొంతం. రాజమౌళి ఇప్పటిదాకా తీసిన సినిమాలు పట్టుమని పదిహేను కూడా ఉండవు. ఆయన రెండు దశాబ్దాలుగా దర్శకుండిగా కొనసాగుతున్నారు. అయితే ఆయన తీసిన సినిమాలు అన్నీ కూడా బాక్సాఫీస్ దగ్గర సూపర్ డూపర్ హిట్లే. బాహుబలి వన్ టూ మూవీస్ తో వేల కోట్ల కలెక్షనలు కళ్ల చూసిన దర్శక దిగ్గజంగా కూడా చెప్పుకోవాలి.అలాంటి జక్కన్న ట్రిపుల్ ఆర్ మూవీతో భారతీయ సినిమా రంగంలో సరికొత్త రికార్డులను టార్గెట్ చేస్తున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే తాజాగా రాజమౌళి మీడియాతో మాట్లాడుతూ తన ఫ్లాష్ బ్యాక్ ని నెమరువేసుకున్నారు. తన తొలి ప్రేమ వివరాలూ రివీల్ చేశారు. ఇక



సినిమాల్లోకి రాక మునుపు తన సతీమణి రమా రాజమౌళి ఒకనాడు జాబ్ చేస్తే తాను కేవలం కథలు రాసుకుంటూ గడిపానని కూడా చెప్పారు. తమ బంధం గొప్పదని అసలైన ప్రేమ తన శ్రీమతిది అని ఆయన పేర్కొన్నారు.తన సినిమాలూ మళ్ళీ ఫెయిల్ అయితే తన భార్యను జాబ్ కి పంపించి భవిష్యత్తు జీవితాన్ని అలా గడిపేస్తాను అంటూ కూడా చెప్పుకున్నారు. అపజయమే ఎరుగని దర్శక ధీరుడు రాజమౌళి నోట ఫ్లాప్ మాట రావడమేంటి అన్నదే ఇపుడు అంతా అనుకుంటున్న విషయం. ఆయన తీయాలే కానీ విజయమనే లక్ష్యాన్ని చేరుకోవడం ఖాయమని అంతా గట్టిగా నమ్ముతారు. అలాంటిది ఫ్లాప్స్ వస్తే అంటూ ఆయన మామూలుగా చెప్పినా కూడా అందరూ షాక్ అయ్యే విషయంగానే చూస్తున్నారు.రాజమౌళి ఈ మధ్య మీడియా ముందు చెబుతున్న అనేక విషయాలను విశ్లేషించుకుంటే ఇకపైన సుదీర్ఘంగా ఏళ్ల తరబడి సినిమాలు తీయను అని కూడా చెప్పారు. ఇపుడు ఫ్లాప్స్ వస్తే గిస్తే అంటున్నారు. ఇవన్నీ చూస్తూంటే ట్రిపుల్ ఆర్ షూటింగ్ విషయంలో ఎదురైన అనేక అవాంతరాలు రెండు సార్లు కరోనా వల్ల ఆగిన షూటింగ్ పెరిగిపోయిన నిర్మాణ వ్యయం. సరైన డేట్ మూవీ రిలీజ్ కి ఫిక్స్ కాక పలు మార్లు వాయిదా ఇలా ఇవన్నీ కూడా దర్శక ధీరుడిని ఇబ్బంది పెట్టాయా అన్న చర్చ వస్తోంది. ఏది ఏమైనా ఒక విషయం మాత్రం స్పష్టం. జయాపజయాలు దైవాధీనాలు. అందువల్ల ఫ్లాప్స్ రావు అని కూడా ఎవరూ చెప్పలేరు. అయితే సుదీర్ఘంగా సినిమాల షూటింగులు చేయబోను అంటూ రాజమౌళి చెప్పడం మాత్రం శుభ పరిణామమే అంటున్నారు అంతా.

# రాణించిన నీషమ్, ఫిలిప్స్.. నమీబియా టార్గెట్ 164



సమయం 17:07.. జిమ్మీ నీషమ్(23 బంతుల్లో 35 నాటౌట్; ఫోర్, 2 సిక్సర్లు), గ్లెన్ ఫిలిప్స్(21 బంతుల్లో 39 నాటౌట్; ఫోర్, 3 సిక్సర్లు) ఆఖర్లో చెలరేగడంతో న్యూజిలాండ్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. గప్టిల్(18), డారిల్ మిచెల్(19), డెవాన్ కాన్వే(17) నిరాశపరచినా.. నీషమ్, ఫిలిప్స్, విలిమయ్సన్(25 బంతుల్లో 28; 2 ఫోర్లు, సిక్స్) ఓ మోస్తారుగా రాణించడంతో న్యూజిలాండ్ ఈ స్కోర్‌ను చేయగలిగింది. నమీబియా బౌలర్లలో స్కోల్జ్, వీస్, ఎరాస్మస్ తలో వికెట్ పడగొట్టారు. సమయం 16:30.. న్యూజిలాండ్‌కు 14వ ఓవర్ ఆఖరి బంతికి మరో షాక్ తగిలింది. అనవసర పరుగుకు ప్రయత్నించి డెవాన్ కాన్వే(18 బంతుల్లో 17; ఫోర్) రనౌటయ్యాడు. 14 ఓవర్ల తర్వాత న్యూజిలాండ్ స్కోర్ 87/4. క్రీజ్‌లో గ్లెన్ ఫిలిప్(4), నీషమ్ ఉన్నారు. నమీబియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో న్యూజిలాండ్ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోతుంది. జట్టు స్కోర్ 81 పరుగుల వద్ద ఉండగా.. ఎరాస్మస్ బౌలింగ్‌లో విలియమ్సన్(25 బంతుల్లో 28; 2 ఫోర్లు, సిక్స్) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఫలితంగా న్యూజిలాండ్ మూడో వికెట్‌ను కోల్పోయింది. 13 ఓవర్ల తర్వాత న్యూజిలాండ్ స్కోర్ 82/3. క్రీజ్‌లో డెవాన్ కాన్వే, గ్లెన్ ఫిలిప్ ఉన్నారు.సమయం 15:57.. ఇన్నింగ్స్ 7వ ఓవర్ రెండో బంతికి న్యూజిలాండ్‌కు మరో షాక్ తగిలింది. బెర్నార్డ్ స్కోల్జ్ బౌలింగ్‌లో డారిల్ మిచెల్(15 బంతుల్లో 19; 2 ఫోర్లు) ఔటయ్యాడు. దీంతో న్యూజిలాండ్ 43 పరుగుల వద్ద రెండో వికెట్‌ను కోల్పోయింది. క్రీజ్‌లో కేన్ విలియమ్సన్(6), కాన్వే ఉన్నారు.సమయం 15:48.. టాస్ ఓడి ప్రత్యర్థి ఆహ్వానం మేరకు తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్.. ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించింది. అయితే డేవిడ్ వీస్ వేసిన 5వ ఓవర్‌లో న్యూజిలాండ్‌కు తొలి ఎదురుదెబ్బ తగిలింది. వీస్ 4.1వ ఓవర్లో మార్టిన్ గప్టిల్(18 బంతుల్లో 18; ఫోర్, సిక్స్)ను పెవిలియన్‌కు పంపాడు. దీంతో న్యూజిలాండ్ 30 పరుగుల వద్ద తొలి వికెట్‌ను కోల్పోయింది. క్రీజ్‌లో డారిల్ మిచెల్(12), కేన్ విలియమ్సన్ ఉన్నారు. షార్జా: టీ20 ప్రపంచకప్ 2021 సూపర్ 12 గ్రూప్-2లో భాగంగా శుక్రవారం(నవంబర్ 5) మధ్యాహ్నం 3:30 గంటలకు షెడ్యూలైన మ్యాచ్‌లో న్యూజిలాండ్, నమీబియా జట్లు తలపడుతున్నాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190